క్లుప్తంగా

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

ఆత్మకూరు : ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మండలంలోని కామారం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. కామారం గ్రామానికి చెందిన ఎలగొండ పరమేశ్వర్ (28) కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి కుటుంబ సభ్యులు ఇంట్లో లేని సమయంలో చీరతో ఇంటిలోని దూలానికి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని తండ్రి శేఖర్ ఫిర్యాదు మేరకు ఆత్మకూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరివేసుకొని బాలిక..

దామెర : బాలిక ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన హనుమకొండ జిల్లా దామెర మండలంలోని ఊరుగొండలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఓ బాలిక స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. కాగా శనివారం సాయంత్రం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకుంది. బంధువులు గమనించి వెంటనే స్థానిక ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై కొంక అశోక్ వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం మార్చురీకి తరలించారు. బాలిక మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

ఎర్రగట్టు జాతర ఆదాయం రూ.12,83,713

హసన్‌పర్తి: ఎర్రగట్టు వేంకటేశ్వరస్వామి జాతర ఆదాయం రూ.12,83,713 సమకూరింది. గతేడాది రూ.12,57,738 వచ్చినట్లు ఈఓ కిషన్‌రావు, ధర్మకర్తలు తెలిపారు. ఎర్రగట్టు వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు శుక్రవారం ముగిశాయి. హుండీ లెక్కింపు శనివారం ఉదయం 10గంటలకు ప్రారంభమై సాయంత్రం వరకు కొనసాగింది. హుండీ లెక్కింపులో ధర్మకర్తలు ఆరెల్లి వెంకటస్వామి, వింజమూరి రమణ, సదానందం, పెద్దమ్మ సురేష్, జన్ను శైలజ, అశోక్‌కుమార్, ప్రశాంత్‌కుమార్, సుమంత్, అటికం శ్రీనాథ్, కనపర్తి రాజు తదితరులు పాల్గొన్నారు.

కాజీపేట నుంచి కాశీకి ప్రత్యేక రైలు నడిపించాలి

కాజీపేట: కాజీపేట రైల్వే జంక్షన్ నుంచి కాశీ, అయోధ్య యాత్రకు ప్రత్యేక రైలు నడిపించాలని స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రం వ్యవస్థాపక అధ్యక్షుడు అయిన వోలు వెంకటేశ్వర్లు శర్మ సూచించారు. కాజీపేటలో శనివారం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి నిత్యం వందలాది మంది కాశీ యాత్రకు వెళ్లాలని అనుకున్నప్పటికీ సరైన రవాణా సౌకర్యం లేకపోవడంతో మిన్నకుండిపోతున్నారని తెలిపారు. సికింద్రాబాద్ నుంచి ఒక రైలు ఉన్నప్పటికీ భక్తుల రద్దీ కారణంగా రిజర్వేషన్ దొరకడం లేదని వాపోయారు. కాశీతో పాటు అయోధ్య బాల రామాలయాన్ని చూడాలనే ఆతృత చాలామందిలో ఉందని అన్నారు. ప్రత్యేక రైలు విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు తీసుకెళ్లాలని కోరారు.

వ్యవసాయాన్ని పారిశ్రామిక రంగంగా గుర్తించాలి

హన్మకొండ/విద్యారణ్యపురి: దేశంలో 70శాతానికి పైగా ప్రజలు ఆధారపడి జీవిస్తున్న వ్యవసాయ రంగాన్ని పారిశ్రామిక రంగంగా మార్చి చట్టం చేయాలని తెలంగాణ మేధావుల ఫోరం నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ ఎండీ.రియాజ్‌ను హనుమకొండ ఎక్సైజ్ కాలనీలోని నివాసంలో తెలంగాణ మేధావుల ఫోరం ప్రధాన కార్యదర్శి డాక్టర్ వీరస్వామి నాయకత్వంలో పలువురు శనివారం కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రియాజ్ మాట్లాడుతూ ఆల్ ఇండియా కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీకి వివరించి కాంగ్రెస్ తరఫున రైతులకు న్యాయం చేస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మేధావుల ఫోరం సహాయ కార్యదర్శి చింతకింది కుమారస్వామి, కోశాధికారి అక్కినపల్లి వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు డాక్టర్ సంజీవ్, సాయిని నరేందర్ తదితరులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శికి సన్మానం

హన్మకొండ: బీజేపీ రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌ను బీజేపీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేష్ సన్మానించారు. హనుమకొండలో శనివారం జరిగిన వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి కోర్ కమిటీ, ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన చంద్రశేఖర్‌ను తన నివాసానికి రమేష్ ఆహ్వానించారు. ఇంటికి వచ్చిన ఆయనకు కుటుంబ సభ్యులతో కలిసి శాలువా కప్పి, భద్రకాళి అమ్మవారి చిత్రపటాన్ని అందించి సన్మానించారు.

మాదిగలకే టికెట్ ఇవ్వాలి

హన్మకొండ: వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ సీటును స్థానిక మాదిగలకే కేటాయించాలని మాదిగ హక్కుల దండోరా ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గనిపాక ప్రదీప్ మాదిగ డిమాండ్ చేశారు.

ఓటమి భయంతోనే బీజేపీ కుట్ర

- మండలాధ్యక్షుడు ప్రకాశ్‌రెడ్డి
- కాంగ్రెస్ బ్యాంకు అకౌంట్ల నిలిపివేతపై భగ్గుమన్న పార్టీ శ్రేణులు
- కేంద్రం దిష్టిబొమ్మ దహనం.. రాస్తారోకో



ఆత్మకూరు : మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

దామెర : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి చెందుతామనే భయంతోనే బీజేపీ కుట్రలు పన్నుతోందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మన్నెం ప్రకాశ్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను చూసి బీజేపీకి కళ్లు మండుతున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన బ్యాంకు అకౌంట్లను కేంద్ర ప్రభుత్వం ఫ్రీజ్ చేయడాన్ని నిరసిస్తూ మండల కేంద్రంలో శనివారం కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేసి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ను భూస్థాపితం చేయడం బ్రిటిష్ ప్రభుత్వానికే సాధ్యం కాలేదని, బీజేపీ ఎన్ని కుట్రలు పన్నినా ప్రజల ఆశీర్వాదంతో కాంగ్రెస్ కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమన్నారు. పార్టీ ఆర్థికవనరులను దెబ్బతీయడంతో పాటు రాహుల్ గాంధీపై తప్పుడు కేసులు బనాయించడం ప్రధాని నరేంద్రమోదీ పైశాచిక ఆనందానికి నిదర్శనమని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ పాలెపాక శ్రీనివాస్, మండల ప్రధానకార్యదర్శి దుర్శెట్టి భిక్షపతి, నాయకులు రాధాకృష్ణ, గుడిపాటి శ్రీధర్‌రెడ్డి, సదిరం పోచయ్య, వెంకటేశ్వర్లు, రవీందర్, రామచందర్, శంకర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీది నియంతృత్వ పాలన

ఆత్మకూరు : దేశంలో బీజేపీ నియంతృత్వ పాలన కొనసాగిస్తోందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రమేష్ విమర్శించారు. బీజేపీ అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసిస్తూ శనివారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ బ్యాంకు అకౌంట్లను నిలిపివేయడం అప్రజాస్వామికమన్నారు. కాంగ్రెస్‌కు వస్తున్న ప్రజాధరణ చూసి బీజేపీ కక్షపూరితంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. ఎంపీపీ సుమలతరజనీకర్, జెడ్పీటీసీ రాధికరాజుగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ వాసు, సొసైటీ చైర్మన్ రవీందర్‌గౌడ్, మాజీ సర్పంచ్ పర్వతగిరి రాజు, నాయకులు బయ్య కుమారస్వామి, వెల్దె వెంకటేశ్వర్లు, అలువాల రవి, రేవూరి జయపాల్‌రెడ్డి, తనుగుల సందీప్ పాల్గొన్నారు.



దామెర : కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు



పరకాల : కాంగ్రెస్ నాయకుల రాస్తారోకో

పరకాల : వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతో బీజేపీ ప్రభుత్వం కుట్రపన్ని కాంగ్రెస్ పార్టీకి చెందిన బ్యాంక్ అకౌంట్‌లను ఫ్రీజ్ చేస్తుందని మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి ఆరోపించారు. కాంగ్రెస్ అకౌంట్‌లను ఫ్రీజ్ చేయడాన్ని నిరసిస్తూ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు పట్టణంలో శనివారం ఆందోళన నిర్వహించారు. సుమారు గంటపాటు రోడ్డుపై బైఠాయించడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, శ్రీనివాస్, కౌన్సిలర్ జయమ్మ, నాయకులు రాజేశ్వర్‌రావు, హరిప్రసాద్, రమేష్ పాల్గొన్నారు.

‘కడియం’ చేరికపై పునరాలోచన చేయాలి

- కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రసాద్



మాట్లాడుతున్న గుర్రపు ప్రసాద్

ధర్మసాగర్ : తాము తలుచుకుంటే ఆరు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలుస్తామని ప్రగల్భాలు పలికిన స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కాంగ్రెస్ పార్టీలోకి చేర్చుకోవడంపై అధిష్టానం పునరాలోచన చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గుర్రపు ప్రసాద్ కోరారు. మండల కేంద్రంలో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కడియం శ్రీహరి 40 సంవత్సరాలుగా రాజకీయాల్లో అనేక పదవులు అనుభవించారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు నెలల్లో కూలిపోతుందని చెప్పిన కడియం.. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలోకి రావడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అలాంటి వారిని పార్టీలోకి చేర్చుకోవడం సరికాదన్నారు. కడియం పార్టీలోకి వస్తే నియోజకవర్గ ప్రజలకు పెనుముప్పు పొంచిఉందని, ఆయన కూతురుకు ఎంపీ టికెట్ ఇస్తే నియోజకవర్గ క్యాడర్‌లో మళ్లీ వర్గపోరు మొదలవుతుందని అనుమానం వ్యక్తం చేశారు. కడియం శ్రీహరి దళిత ద్రోహి అని ఆరోపించారు. రాజకీయ స్వాలాభం కోసమే కాంగ్రెస్‌లో చేరుతున్నారని అన్నారు. 40 సంవత్సరాల నుంచి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను అనిచివేస్తు అక్రమ కేసులు బనాయించిన చరిత్ర కడియంకే దక్కుతుందన్నారు. కడియం చేరికను వెనక్కి తీసుకోవాలని ఆయన కోరారు. వరంగల్ ఎంపీ టికెట్ దళితులైన మాదిగ సామాజిక వర్గానికి చెందిన సింగపురం ఇందిరకు ఇవ్వాలని అధిష్టానాన్ని కోరుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ లెనిన్, నాయకులు దుర్గయ్య, రవీందర్, లక్ష్మీ, భిక్షపతి, ఆరోగ్యం, సమ్మయ్య, రవీందర్, తిరుపతి, ఎల్లగౌడ్ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

కష్టపడినవారికి సముచిత స్థానం కల్పించాలి




మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

వేలేరు : కాంగ్రెస్ పార్టీలోకి ఎవరూ వచ్చినా తమకు అభ్యంతరం లేదని, పార్టీ కోసం కష్టపడిన వారికి సముచిత స్థానం కల్పించాలని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి కాంగ్రెస్‌లోకి వస్తున్నారనే ప్రచారం నేపథ్యంలో శనివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కొన్ని సంవత్సరాలుగా పార్టీ కోసం పనిచేస్తున్న నాయకులకు, కార్యకర్తలకు రాబోయే రోజుల్లో కూడా సముచిత స్థానం కల్పించాలని అధిష్టానాన్ని కోరుతున్నట్లు తెలిపారు. పదేళ్లుగా నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర కష్టనష్టాలను ఓర్చుకొని ముందు తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రస్తుత ఎమ్మెల్యే కడియం శ్రీహరికి వరంగల్ ఎంపీ టికెట్ ఇచ్చి, ఆయన రాజీనామాతో ఖాళీ అయిన ఘనపూర్ ఎమ్మెల్యే టికెట్‌ను ఇందిరకు కేటాయించాలని కోరారు. పార్టీ అధిష్టానం ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ మల్కిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కత్తి సంపత్, మాజీ ఉపసర్పంచ్ సద్దాం హుస్సేన్, జోడుముంతల సంపత్, రాజమల్లయ్య, తెల శ్రీకాంత్, పోలు తిరుపతి, మహేష్ పాల్గొన్నారు.

అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేస్తా

- బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్



మాట్లాడుతున్న అరూరి రమేష్

పరకాల : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా గెలిపిస్తే నియోజవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని వరంగల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల సన్నాహాక సమావేశాన్ని పట్టణంలోని మయూర గార్డెన్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. వచ్చే పార్లమెంట్ ఎన్నికలు దేశ భవిష్యత్‌ను నిర్ణయించే ఎన్నికలన్నారు. మోదీ పాలన ధర్మబద్ధమైందని, కాంగ్రెస్‌ది అవినీతి, దోపిడిని ప్రోత్సహించే పాలన అన్నారు. ప్రజలు సరియైన నిర్ణయం తీసుకొని బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ ప్రభారి మురళీధర్ గౌడ్, డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, డాక్టర్ పగడాల కాళీప్రసాద్‌రావు, డాక్టర్ సిరంగి సంతోష్‌కుమార్, నియోజకవర్గ కన్వీనర్ ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే శ్రీరాములు, మాజీ మేయర్ రాజేశ్వర్ రావు, పార్లమెంట్ కన్వీనర్ కుమారస్వామి, పరకాల అసెంబ్లీ ప్రభారి రమేష్, నాయకులు గురుప్రసాద్, ఆర్‌పీ జయంత్‌లాల్, దేవునూరి మేఘనాథ్, రాజభద్రయ్య, దేవేందర్‌రెడ్డి, భద్రయ్య, పూర్ణాచారి, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

దామెరలో చేరికలు..

దామెర : కేంద్రంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి వచ్చి హ్యాట్రిక్ సాధించడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ పగడాల కాళీప్రసాదరావు ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని దుర్గంపేట గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు శనివారం బీజేపీలో చేరగా ఆయన కండువా కప్పి ఆహ్వానించారు. బీజేపీ అభ్యర్థుల గెలుపునకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఉపసర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, వార్డు సభ్యులు చిల్లా రాజేందర్, గండు రాజు, పాలెపాక భిక్షపతి, పలువురు కార్యకర్తలు బీజేపీలో చేరినవారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి కొండి జితేందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు జంగిలి నాగరాజు, సీనియర్ నాయకులు మంద ఐలయ్య, మండల ప్రధానకార్యదర్శులు గన్ను సతీష్, వేల్పుల రాజ్‌కుమార్, సొసైటీ డైరెక్టర్ పొడాల మధూకర్, ముత్యాల సృజన్, పరుశరాం, రాజు, సమ్మిరెడ్డి పాల్గొన్నారు.

15 మూగజీవాలు మృతి



మృతి చెందిన మేకలను పరిశీలిస్తున్న నాయకులు

శాయంపేట : పచ్చిక మేసేందుకు వెళ్లిన 15 మేకలు యూరియా కలిపిన నీళ్లు తాగి మృతిచెందాయి. ఈ సంఘటన మండలంలోని మైలారంలో శనివారం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మైలారం గ్రామానికి చెందిన బొంతల పోషాలు, జక్కుల సాంబాలు, బొంతల కుమారస్వామి మేకలను పచ్చిక మేపేందుకు మండల కేంద్రంలోని వ్యవసాయ భూములకు రోజుమాదిరిగానే తీసుకెళ్లారు. ఈ క్రమంలో ఓ రైతు తన వ్యవసాయ భూమి వద్ద యూరియా కలిపిన నీటిని ఉంచగా మేకలు తాగి అక్కడిక్కడే మృతిచెందాయి. సుమారు రూ.2.50 లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు కన్నీటి పర్యంతమయ్యాడు. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నాడు. కాగా ఘటన స్థలాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి మారెపల్లి రవీందర్, గ్రామశాఖ అధ్యక్షుడు చింతల రవిపాల్, మారెపల్లి రాజేందర్ పరిశీలించారు.

యేసుక్రీస్తు మార్గంలో పయనించాలి



శిష్యుల పాదాలు కడుగుతున్న పాల్సన్‌రాజ్

ధర్మసాగర్ : శాంతియుత సమాజాన్ని నెలకొల్పేందుకు ప్రతిఒక్కరూ యేసుక్రీస్తు మార్గంలో పయనించాలని కరుణాపురం క్రీస్తు జ్యోతి మినిస్ట్రీస్ ఫౌండర్ అంతర్జాతీయ ప్రసంగీకుడు, ప్రవక్త రెవ డాక్టర్ సంగాల పాల్సన్‌రాజ్ అన్నారు. మండలంలోని కరుణాపురంలో శనివారం సొసైటీ ఆఫ్ క్రైస్ట్ జనరల్ సెక్రటరీ రెవ డాక్టర్ జయప్రకాశ్‌గోపు అధ్యక్షతన మండల కేంద్రంలో శిష్యుల పాదాలు కడిగే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జీవితంలో హెచ్చుతగ్గులు సహజమని, వాటిని అధిగమించి లక్ష్యాన్ని ఛేదించాలని అన్నారు. గర్వంగా ఉండే గుణం ద్వారా చాలా కోల్పోతారని, అలాంటి స్వభావాన్ని వదులుకోవాలని సూచించారు. శాంతియుత స్థాపన కోసం యేసుక్రీస్తు చూపిన తగ్గింపు స్వాభావ అస్త్రం గొప్పదని అన్నారు. యేసుక్రీస్తు శిష్యుల పాదాలు కడిగి మానవాళికి గొప్ప సందేశం ఇచ్చారని తెలిపారు. అనంతరం మే 3 నుంచి 7వ తేదీ వరకు జరిగే ప్రార్థన పండుగ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మత్యాస్‌రెడ్డి, జయ్‌పాల్‌రెడ్డి, సంగాల ఇర్మియా, డాక్టర్ ప్రదీప్, జయాకర్, రవిపాల్, బ్రదర్స్, సిస్టర్స్, వలంటీర్లు పాల్గొన్నారు.

పరిపాలనను గాలికి వదిలేసిన కాంగ్రెస్

- మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



మాట్లాడుతున్న చల్లా ధర్మారెడ్డి

పరకాల : ప్రజా పరిపాలనను గాలికి వదిలేసి బీఆర్ఎస్ నేతలను, ఎమ్మెల్యేలను కొనుగోలు చేసే పనిలో కాంగ్రెస్ బీజీగా ఉందని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి విమర్శించారు. తాను పార్టీ మారుతున్నట్లు జరుగుతున్న ప్రచారంలో ఏలాంటి వాస్తవం లేదన్న ఆయన.. పార్టీ కార్యకర్తలు అధైర్య పడొద్దని అన్నారు. పట్టణంలోని ఎస్‌జే గార్డెన్‌లో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నంత కాలం ప్రతి ఇంటికి తాగునీరు, ప్రతి ఎకరానికి సాగునీరు, కల్యాణలక్ష్మి, రైతుబంధుతో పాటు ప్రతి జిల్లాకు కలెక్టరేట్ భవనాలు, మెడికల్ కాలేజీలు నిర్మించామన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించకుండా బీఆర్ఎస్ నేతలపై, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందని, ప్రజల తరఫున ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని పోరాడాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి చిత్తశుద్ధిఉంటే 100 పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేయడంతో పాటు రద్దు చేసిన రోడ్లన్ని నిర్మించాలని సవాల్ విసిరారు. మున్సిపల్ వైస్ చైర్మన్ రేగూరి విజయ్‌పాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సారంగపాణి, మాదారం పీఏసీఎస్ చైర్మన్ నల్లెల లింగమూర్తి, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సాంబరెడ్డి, సురేందర్‌రావు, జయపాల్‌రెడ్డి, కళావతి పాల్గొన్నారు.

ఇంటింటికీ భగీరథ నీరు అందించాలి

శాయంపేట : మండలంలోని ప్రతీ ఇంటికి మిషన్ భగీరథ నీరు అందేలా చర్యలు తీసుకోవాలని మిషన్ భగీరథ ఎస్ఈ మల్లేష్ సిబ్బందికి సూచించారు. మండలంలోని గంగిరేణిగూడెం, సూర్యనాయక్‌తండా, ఆరెపల్లి, కాట్రపల్లి, రాజుపల్లి గ్రామాలను శనివారం ఆయన సందర్శించారు. వేసవిలో తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సిబ్బందికి వివరించారు. చేతి పంపులను ఉపయోగంలోకి తీసుకువచ్చేలా చూడాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. తాగునీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశామన్నారు.

హుండీ లెక్కింపు



కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

వేలేరు : మండలంలోని మల్లికుదుర్ల శివారులో గల గట్టు మల్లికార్జునస్వామి హుండీని ఆలయ ఈఓ అద్దంకి నాగేశ్వరరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ పల్లా ప్రమోద్‌రెడ్డి సమక్షంలో శనివారం లెక్కించారు. హుండీల ద్వారా 47 రోజుల కాలానికి రూ.2లక్షల 34 వేల 192 వచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవదాయ ధర్మాదాయ శాఖ డివిజన్ పరిశీలకుడు అనిల్‌కుమార్, డైరెక్టర్లు మహేందర్, రమారెడ్డి, పూజారులు వినయ్‌శర్మ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ‘పది’ పరీక్షలు




కమలాపూర్ : పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

కమలాపూర్ : ఈ నెల 18వ తేదీ నుంచి ప్రారంభమైన పదో తరగతి వార్షిక పరీక్షలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. మండల వ్యాప్తంగా ఏర్పాటు చేసిన నాలుగు పరీక్ష కేంద్రాల్లో 614 మంది విద్యార్థులకు 613 మంది విద్యార్థులు హాజరై పరీక్షలు రాశారని, శనిగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒక విద్యార్థి పరీక్షలకు గైర్హాజరైనట్లు ఎంఈఓ ఇ.రాంకిషన్‌రాజు, పరీక్షల చీఫ్ సూపరిండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు తెలిపారు. గతేడాది పదోతరగతి పరీక్షల్లో కమలాపూర్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో హిందీ ప్రశ్నపత్రం లీకైన నేపథ్యంలో ఈ ఏడాది అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. గతేడాది హిందీ ప్రశ్నపత్రం లీకైన బాలుర ఉన్నత పాఠశాల వెనుక వైపు ప్రత్యేకంగా ఒక పోలీస్ కానిస్టేబుల్‌తో పాటు ఇద్దరు పంచాయతీ కార్యదర్శులను బందోబస్తుగా నియమించారు. అధికారులు సైతం అటు వైపు ఉన్న కిటికీలన్నింటినీ మూసివేసి పదోతరగతి పరీక్షలు నిర్వహించగా డీఈఓ, జిల్లా అదనపు కలెక్టర్, ప్రతి రోజు స్క్వాడ్ బృందాలు పరీక్ష కేంద్రాలను సందర్శించి తనిఖీలు నిర్వహించాయి. స్థానిక పోలీస్ ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ ఆధ్వర్యంలో నాలుగు పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎల్కతుర్తిలో..

ఎల్కతుర్తి : ఈనెల 18వ తేదీన ప్రారంభమైన పదోతరగతి వార్షిక పరీక్షలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండల కేంద్రాల్లో మొత్తం నాలుగు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా విద్యార్థులు పూర్తిస్థాయిలో హాజరై పరీక్షలు రాశారు. వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ముగియడంతో విద్యార్థులు వసతి గృహాల నుంచి ఇంటి బాట పట్టారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

‘దొమ్మాటి’కి ఎంపీ టికెట్ ఇవ్వాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పరకాల : కాంగ్రెస్ పార్టీ వరంగల్ పార్లమెంట్ టికెట్ దొమ్మాటి సాంబయ్యకు కేటాయించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట శనివారం ఆందోళన చేపట్టారు. గత కొద్ది రోజులుగా దొమ్మాటి సాంబయ్యకే వరంగల్ పార్లమెంట్ టికెట్ ఖాయమైనట్లు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూతురు కడియం కావ్యకు పార్టీ అదిష్టానం మొగ్గుచూపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో పరకాల పట్టణంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి గెలుపు కోసం శ్రమించిన దొమ్మాటి సాంబయ్యకు టికెట్ ఇస్తే అత్యధిక మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని అన్నారు. మాజీ ఎంపీపీ ఓంటేరు రాంమూర్తి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మంద రాంచందర్, పసుల రమేష్, ఇనుగాల రమేష్, బొమ్మకంటి చంద్రమౌళి, సదన్‌కుమార్, రవికుమార్, రవి, మోహన్‌రావు, తిరుపతిరావు పాల్గొన్నారు.

స్నేహితురాలికి చేయూత



ఆర్థిక సాయం అందిస్తున్న స్నేహితులు

నడికూడ : మండలంలోని రాయపర్తి గ్రామానికి చెందిన కూరాకుల వరలక్ష్మీ కుమారుడు కూరాకుల నితిష్ ఇటీవల ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. కాగా, వరలక్ష్మీ చిన్ననాటి స్నేహితులు శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రూ.22 వేలు ఆర్థిక సాయం అందించారు. బొల్లపల్లి రఘురాం, బొచ్చు నాగరాజు, కరుణాకర్, బొమ్మకంటి చంద్రమౌళి, సుధమల్ల అనిల్, మడికొండ రామ్మూర్తి, లక్ష్మీ, శ్యామల, సరిత, తదితరులు ఉన్నారు.

ఎమ్మార్పీఎస్ సదస్సుకు తరలాలి

దామెర : నియోజకవర్గ స్థాయి ఎమ్మార్పీఎస్ సదస్సును జయప్రదం చేయాలని ఆ సంఘం పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ మంద రాజు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శనివారం ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏప్రిల్ 1వ తేదీన పరకాల పట్టణంలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ, ఎంఎస్ఎఫ్ నియోజకవర్గ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ హాజరుకానున్నట్లు వెల్లడించారు. నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు, మాదిగ, ఉపకులాల సభ్యులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. మాదిగల హక్కుల సాధనకు ప్రతిఒక్కరూ ముందడుగు వేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శులు జిల్లెల్ల మురళి, శంకర్, మండల అధ్యక్షుడు గజ్జి మధూకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్, నాయకులు చిలువేరు సూర్యకిరణ్, ప్రదీప్, సాగర్, రాజశేఖర్, జయపాల్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

శాయంపేట : మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో స్థానిక ఎంపీటీసీ బాసాని చంద్రప్రకాశ్ తన తల్లిదండ్రులు బాసాని కైలాసం- కనకలక్ష్మీ, భార్య రమాదేవి స్మారకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మాజీ సర్పంచ్ రవి శనివారం ప్రారంభించారు. ప్రజల దాహార్తి తీర్చడం అభినందనీయమన్నారు.